**(చదరంగం ఎత్తులు బాగా తెలిస్తే సంసారం ఎత్తులు బాగా తెలుస్తాయని అంటారు పెద్దలు. చదరంగం ఆట మస్తు, నిర్మస్తు అని రెండు రకాలు. బలగం అంతనూ చంపేసి రాజుని ఒక్కణ్ణి చేసి ఆట కట్టడం మస్తు. అత్యవసరంగా బలాన్ని చంపి బలగం ఉంటూండగా రాజుని కట్టడం నిర్మస్తు. కాగా బంటుతో తోసిరాజు అని ఆటకట్టడం చాలా ఘనమైన పద్ధతి. ఈ రెండు రకాల ఆటలలోనూ విజయనగరం మహారాజు ఆనంద గజపతిరాజుగారూ, వారి ఆస్థాన విద్వాంసులు కూరెళ్ల శాస్త్రిలుగారూ సరి ఉజ్జీలు అని ప్రసిద్ధి. నాకు చదరంగం ఆట విశేషాలు చెబుతూ ఒకనాడు మా నాన్నగారు మహారాజుగారున్నూ, కూరెళ్ల శాస్త్రులు గారున్నూ ఆడిన ఆట గురించి ఒక కథ చెప్పారు. ఆ ముచ్చట చాలా విచిత్ర పరిణామానికి దారితీసింది. ఆ వైనం ఈ ముచ్చటలో తెలుసుకుంటారు పాఠకులు. ఇక చదవండి!)**

# తోసిరాజు

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

"మీ మేనమామగారు కూరెళ్ల శాస్త్రులుగారు ఘనంగా ఆడేవారు చదరంగం అని అంటావు. ఒక మాట చెప్తావా?" అని మా నాన్నని అడిగాను. అప్పుడే మధ్యాహ్నం నిద్ర నుండి లేచి అలవాటుగా జీడిపప్పు కసింత వెండి పళ్లెంలో వేసుకుని తింటూ నన్ను దగ్గిరగా రమ్మన్నారు ఆయన. "ఊఁ, కానిస్తూ ఉండు!" అని రెండు పలుకులు నా చేతులో వేసి పళ్లెం నా దగ్గరగా తోసి కథ ఆరంభించారు.

"మా తాతగారు కూరెళ్లవారు. గజపతి నగరం దగ్గర ఉన్న ములకలగుమడాం కూరెళ్లవారి అగ్రహారం. దాన్ని విజయనగరం సంస్థానంవారు మా తాతగారికి శ్రోత్రియం గ్రామంగా ఇచ్చివేశారు. మా మేనమామ శాస్త్రులుగారు లేరూ కూరెళ్ల శాస్త్రులుగారంటె చాలా ప్రసిద్ధి. చదరంగంలో శాస్త్రులుగారికి సరయిన ఉజ్జీ లేదు. ఒక్క ఆనంద గజపతి మహారాజుగారు కాస్త సరిసమానంగా తూగుతారని అనవచ్చు. కూరెళ్లవారికి అన్ని హక్కుభుక్తాలతో అగ్రహారం అయిన గుమడాం చదరంగం ఆడడానికిగాను సంక్రమించింది. తెలిసిందా కూరెళ్ల వారికి గుమడాం అగ్రహారం వచ్చిన వైనం?

చదరంగం బల్లమీద వేసిన గడికి వేయకుండా గుర్రాన్ని అరవై నాలుగు గళ్లల్లోనూ ఒకే ఊపులో వేసుకుంటూ వెళ్లిపోయిన వాణ్ణి చదరంగంలో ఇంకెవ్వడూ 'ఆటకట్టు' అని అనలేడంటే నమ్ము. ఆనందగజపతి మహారాజులుంగారికి గుర్రపు స్వారి అంటే వెర్రి సరదా. ఆయన గుర్రపు స్వారీని గురించి ఇంకోమారు చెప్తాను. ముందీ చదరంగం కథ కానీ. ఆనందగజపతి మహారాజుగారు కూడా చదరంగంలో స్వయంకృషితో పైకి వచ్చినవారు. కూరెళ్ల శాస్త్రులుగారికి చదరంగం కులవిద్య. అయితే శాస్త్రులుగారికి చదువూ సంధ్యా లేదని అనుకొనేవు సుమా! తర్కశాస్త్రంలో మా మేనమామ గడిదీరిన బంటు. శాస్త్రులుగారు విద్యా వివాదాలలో ఒక పుడక వేసి చదరంగం ఆటలోకి వెళ్లిపోతే తిరిగి వచ్చేదాకా ఆ వాదోపవాదాలు అలా రాజుకుంటూ పోవలసినవే గానీ చల్లారడం అనేది లేదు. కాగా సమాధానం శాస్త్రులుగారే చెప్పి ఆ చిక్కు విప్పాలి. ఇక చదరంగం మాట! రాజుగారికి గుర్రపు నడక నలుడికి పట్టుపడ్డట్టు పుట్టుకతోనే వశమయిన విద్య. ఏలాటి చచ్చు గుర్రమూ ఆనంగజపతి మహారాజు చేయి మీద పడితే చెంగున లేడిలాగు ఆ ఎత్తున దాట్లు వేసేది. నేను అలాటి సందర్భాలు కళ్లారా చూసిన వెన్నో ఉన్నాయి. ఆయన గుర్రపు విద్యలో అంతవాడు. మరి చదరంగంలో గుర్రపు నడకలు బాగా తెలిసి ఉండాలి. పై వాళ్లను అడిగి తెలుసుకోడానికి మహారాజుకి పరువూ నామోషీ. ఆటతోనే చూసి, ఊహించి నేర్చుకోవాలి. హెచ్చు తక్కువ వస్తే రాచబిడ్డ మరి. శాస్త్రులుగారు ముందు ఎత్తు వేసేవారు. మోతీమహల్ చూశావు కదూ! అందులో దక్షిణపు కొనను ఎత్తులు వేయడం ఆరంభం అయ్యేది. ఒక గంట కాగానే పలకా, బలం అక్కడే వదిలేసి ఇద్దరూ లేచి సరాసరి కొలువులోకి వచ్చేవారు. అక్కడ విద్యాగోష్ఠి, రాచకార్యాల విచారణ, రాచబంధువుల రాకపోకలు, అతిథులు, అభ్యాగతులు, కుశల ప్రశ్నలు ఒకటేమిటి. కొలువే కొలువు. నవరసభరితంగా పన్నెండు గంటలవరకూ దర్బారు సాగేది. ఆ లోపల కవులూ, అష్టావధానులూ, గాయకులూ, వీణావాదనములూ జరుగుతూ ఉండేవి.

భోజనాల వేళ అవగానే రాజావారు దర్బారు చాలించి లేచేవారు. చేతులు జోడించి, "కొలువు చాలిద్దామా! పండితులందరూ దయచేసి సాయంకాలం నాలుగు గంటలకు సమావేశం అయితే మేమూ హాజరవుతాము!" అని ఆనందగజపతి అన్న మాటల్లో వినయం, పండిత గౌరవం, బ్రాహ్మణభక్తి పాలపొంగులా పొంగుతూ ఉండేవి. నీకు ప్రస్తుతం శాస్త్రులుగారి చదరంగం కథలో ఆనందగజపతి మహారాజుని తెలియజేస్తున్నాను. ఒక ఆశ్చర్యకరమైన ముచ్చట చెబుతున్నాను విను.

యథాప్రకారం ఒకనాడు మహారాజావారు గుర్రపు బండిని పంపారు మా మేనమామ కోసం. నేను గుర్రపు బండిని చూడగానే గబగబా లోపలికి పరుగెత్తుకుంటూ వెళ్లి దేవుడు పెట్టె దగ్గర చిత్రాసనం మీద మఠం వేసుకుని కూర్చున్న మా మామయ్యను గోలచేసి అరుస్తూ.

"గుర్రపుబండి వచ్చింది మామా!" అని చప్పట్లు కొట్టాను. కోపంతో గుడ్లురుముతో మా మావ చప్పున కళ్లు తెరిచి చూశాడు. కళ్లు చింతనిప్పుల్లా ఎర్రగా ఉన్నాయి. నాకేమిటో భయం వేసింది. ఆయన ఎప్పుడూ నన్నంత కోపంతో చూడలేదు. నేను అంత ఆవేశంతో ఆ ఇంట్లో కేకలు వేయలేదు. కాగా ఆయన జపం చేస్తున్నాడన్నమాటే మరిచిపోయాను. నా సందడే నాది. గుర్రపు బండి వచ్చింది. మామయ్యతోపాటు గుర్రపు బండి ఎక్కి కోటలోకి దర్జాగా వెళ్లవచ్చు. అదీ నా సంతోషం... నన్ను మామ చూసిన చూపులో బిక్కచచ్చి గోడకి బల్లిలా అంటుకుపోయాను.

జపం విఘ్నం అయిపోయిందని మామకి ఎంత కోపం వచ్చిందో! నా బిక్కమొగం చూచి ఆ నిమిషంలోనే అంత జాలి పుట్టుకువచ్చింది. కళ్లు ఎర్రగానే ఉన్నా దానిమ్మ గింజల్లాంటి పలువరున పైని తోచిన నవ్వు తెల్లగా ముతాబాలాగు వెలిగింది. బతికానురా బాబూ! అని లోలోపల మనస్సుని సర్దుకున్నాను.

"వెర్రివాడా! గుర్రపు బండీ అంటే అంత సరదా ఏమిట్రా నీకు! ఇంకా అరగంట ఆలస్యం అవుతుందనీ, గుమ్మానికి పక్కగా తీసి ఉంచమనీ చెప్పి రా!" అన్నాడు మామ. ఒక్క దాటులో వెళ్లి ఆ రెండు మాటలూ బండివాడికి అప్పగించి లోపలికి వచ్చాను.

మామయ్య మరి జపం చెయ్యలేదు. అలాగే లేచిపోయి ధోవతీ మార్చుకుని తన గదిలోకి వడిగా పంచతో వెళుతూ,

"ఒరే, లక్ష్మీ నరసింహా!" అని ఒక కేక వేశాడు. నేను వడివడిగా అంగలు వేసుకుంటూ గదిలోకి వెళ్లాను. ఆయన పంచ కట్టుకుని కుర్చీలో

కూర్చున్నాడు. మా అత్త వెండి గిన్నెలో ఇంత మజ్జిగ తెచ్చి మేజాపైన పెట్టి వెళ్లిపోయింది. మామయ్య మజ్జిగ తాగుతూ

"ఏమిట్రా! మజ్జిగ ఏమిటో కాటు వాసన వేస్తున్నది, నరసింహా!" అన్నాడు నన్ను చూసి. నేను వాసన చూశాను. అది పారబోసి తెద్దామన్నా ఉన్న మజ్జిగ అంతా ఒకటేగా. ఇంకేం చేయాలో నాకు తోచలేదు. ఊరుకున్నాను. మామ పంచాగం తీసి చూసి చప్పున మూసేసి,

"లక్ష్మీనరసింహా! ఇవాళ శనివారం. ఇప్పుడు దుర్ముహూర్తం పోగానే వర్జ్యం కూడా ఉంది కదా! మహారాజా వారి దర్శనానికి ఎలా వెళుతాము? వారికి కూడా తెలుసునే. శనివారంనాడు భోజనాలయ్యాక పంపించేవారు గుర్రపు బండి. ఈవేళ ఆశ్చర్యంగా ఉందే .... ఏం చేయాలో తోచలేదురా!" అన్నాడు.

నేను ఏమీ అనలేదు. "ఊఁ, కానీ! ఏమయితే అదే అవుతుంది. రాజాజ్ఞ దైవాజ్ఞ అన్నారు పెద్దవాళ్లు. పద!" అని దర్బారుకి వెళ్లే వేషం వేసుకుని మామ బయలుదేరాడు. నేను చూస్తూ ఒక్కొక్క అడుగు వేస్తూ అల్లంత దూరాన నిలిచిపోయాను. "రా! అక్కడే ఉండిపోయావేం. సూదితో దారం బొంతకి అలంకారం. దా!" అన్నాడు నన్ను రమ్మని సంజ్ఞ చేస్తూ. ఇంకేం చెప్పేది నా సంబరం! ఎగిరి గంతు వేశాను. ఒక్క దాటులో గుర్రపు బండి చేరుకుని మామూలుగా నేను కూర్చునే చోట కూర్చున్నాను. మామ కూర్చున్న తరువాత సరాసరి గుర్రపు బండి కోటలోకి వెళ్లింది.

కోటలో ఆంజనేయస్వామివారి దర్శనం చేసుకున్నాకనే కొలువుకి వచ్చేవారు. కోవెల దగ్గరకు వెళ్లగానే మేము బండి దిగి ఆలయంలోనికి వెళ్లాము. ఆనందగజపతి మహారాజావారు మాకంటె ముందుగానే స్వామి దర్శనానికి వచ్చి ఉన్నారు. పూజారి కర్పూరం వెలిగించి స్వామికి ఇచ్చి రాజావారికి ఎదురుగా శఠగోపం పట్టుకుని నిలిచాడు. రాజావారు కళ్లతో సంజ్ఞ చేశారు పూజారికి శాస్త్రులుగారికి ముందు హారతి ఇవ్వండని. మామయ్య, నేనూ హారతి తీసుకున్నాము. అంతవరకూ చేతులు కట్టుకునీ రాజావారు దేవుడికి పక్కగా నిలిచి ఉన్నారు. రాజుగారు కూడా హారతి తీసుకున్నారు. తీర్థప్రసాదాలు కూడా తీసుకోవడం అయింది. పది నిమిషాల్లో వస్తున్నాము. శాస్త్రులుగారు మోతీ మహలుకి దయచేయండని సగౌరవంగా రాజాగారు సెలవిచ్చి అంతఃపురానికి వెళ్లిపోయారు.

మామయ్య ముందు నడుస్తూ, "ఒరే నరసింహా! ఇవాళ స్వామివారి సమక్షంలో రాజా వారి దర్శనం అయింది. దుర్ముహూర్తం ఇక్కడే పోయిందిరా!" అని అన్నాడు. నేను ఆ మాటలు అట్టే వినిపించుకోలేదు. నా దృష్టి మోతీమహల్ మీదికి పోయింది.

మా మామయ్య అంత పొడవూ కాదు, పొట్టీ కాదు. సవారగా ఉంటాడు. కాని బలిష్ఠకాయుడు. నరసరా నడిచిపోతున్నాడు. నేను వెంటపడాడను. మేము మోతీమహలులోకి వెళ్లేసరికి రెండు అరటి ఆకులలో ఇంత మిఠాయి, మూడు నాలుగు రకాల పళ్ల ముక్కలు రెండు గ్లాసులతో పాలు సిద్ధంగా ఉన్నాయి. మామయ్య లాంఛనంగా ఒక్కొక్క ముక్క నోట్లో వేసుకుని అన్నీ అలాగే వదిలేసి పాలు మాత్రం గటగటా తాగేశాడు. నేను నా కోసం పెట్టిన ఫలహారం సామానంతా చల్లచల్లగా ఊదేశాను. పాలు తాగి గ్లాసు అక్కడ పెట్టాను. మహారాజావారు వచ్చారు. మామయ్య కుర్చీమించి లేచాడు. "ఆఁ.... ఆఁ..... దయచేయండి!" అంటూ రాజావారు నమస్కారం చేసి మామయ్యకి ఎదురుగా కూర్చున్నారు.

"ఇవాళ చిన్నమామగారు ముందు ఎత్తు వేయాలి!" అని నా బుగ్గ మీద ఒక చిటిక వేశారు రాజావారు.

"వేస్తాడు మా వాడు ఎత్తులు. బాగానే వేస్తాడు. కానీ కొంచెం మొగమాటం మనిషి!" అన్నాడు మామ.

"తమకి మేనల్లుడైనాక ఎత్తులు రాకుండా

**యామిజాల పద్మనాభస్వామి గారి కథ 1-4-59 వ సంవత్సరంలో ప్రచురితమైంది.**

ఉంటాయా?" అన్నారు చిరునవ్వుతో ఆనందగజపతి.

"అబ్బే! నా దగ్గర ఏమీ నేర్చుకోలేదు!"

"అయితే అత్తయ్యగారి దగ్గర నేర్చుస్తున్నావా చదరంగం!" అన్నారు రాజావారు.

"అంతే.... అంతే!" అన్నాడు మామ.

ఆట ఆరంభం అయింది. ముందు మామ బంటును తోసి గుర్రాన్ని దాటించి రాజును సర్దాడు. తరువాత రాజావారు ఎదురెత్తు వేశారు. ఆట జరుగుతోంది. మంచి రసకందాయంలో ఉంది. అప్పటికి పదకొండు గంటలయింది. బంట్రోతు వచ్చి ఏవో అర్జంటు కాగితాలనీ, దివానుగారు పంపారనీ అల్లంత దూరంలో నిలబడి రాజుగారికి మనవి చేశాడు.

"అలా తే!" అని బంగారు గొలుసుతో ఉన్న రిస్టువాచీ తళుక్కుమన్నట్టు చేయి చాచి ఆనంద గజపతి కాగితాలు అందుకుని సంతకం పెట్టేసి వాడికిచ్చేశారు.

"పదకొండు గంటలు దాటినట్టుంది!" అని మామ రాజావారితో అన్నాడు.

రాజుగారు వాచి చూసి, "క్షమించండి శాస్త్రులుగారూ! చదరంగం సందడిలో తెలుసుకోలేకపోయాను. భోజనానికి చాలా పొద్దెక్కిపోయింది. లేద్దాము!" అన్నారు.

యథాలాంఛనంగా గుర్రపు బండి వచ్చింది. మేము బండి ఎక్కుతూ ఉంటే రాజుగారు "రెండు గంటలకు బండీ వస్తుంది!" అని అధికారం సూచించే గొంతుకతో అన్నారు.

"చిత్తం, రావచ్చు!" అన్నాడు మామ దర్జాగానే అన్నాడు మామ ఆ మాట.

కోటలోంచి రాగానే స్నానం చేసి భోజనం చేయడం మామకి అలవాటు. మామ స్నానం చేసి విస్తరి ముందు కూర్చుని ప్రాణాహుతులు పట్టేసరికి కోటలోంచి బంట్రోతు వచ్చాడని మా పెద్ద బావ ఒక చీటీ తెచ్చి ఇచ్చాడు. దానిమీద 'శకటుని వేస్తున్నాము' అని ఉన్నది. మామ నవ్వుకుని " 'దానికి గుర్రపు పగ ఉన్నది. ఆ పై ఎత్తులో మంతిర తెరపు వస్తుంది. గుర్రానికి ఎడమవైపు బంటు కాపు' అని రాసి పంపరా!" అన్నాడు మామ.

మా పెద్దబావ అలాగే రాసి పంపాడు.

వీళ్లకి ఏ పని చేస్తున్నా చదరంగం బల్లా, బలమూ తప్ప ఇంకోటి తలలో లేదు గాబోలు అనుకుని నేను అలాగే చూస్తూ కూర్చున్నాను. "లే! లే! భోజనం కానీ, గుర్రపు బండి వస్తుంది. చూశావా, రాజావారి నిషా!" అన్నాడు మామ. నేనేమీ అనలేదు. భోజనాలయ్యాయి. గదిలోకి వెళ్లాము. గుర్రపు బండీ వచ్చిందని వార్త వచ్చింది.

"ఇవాళ ఏదో కొంప మునుగుతుంది. ఊఁ, కానీ, లేకపోతే ఇంత పిచ్చేమిటి?" అని గొణుక్కుంటూ మామ గుర్రపు బండి ఎక్కుతూ, "దా!" అని నన్ను చూసి చేయి ఊపాడు. నాకు ఏమిటో వెళ్లాలని మనసు రాలేదు. బలవంతంగా బండి ఎక్కుతున్నాను. మా అత్త లోపలనించి "ఓమారు ఇలా వచ్చి వెళ్లండి!" అని కేక వేసింది. కిమ్మనకుండా మామయ్య బండీ దిగి లోపలికి వెళ్లి అయిదు నిమిషాల్లో వచ్చి బండీలో కాలు పెడుతూ తుమ్మాడు.

"బాబయ్యా! బండి పోనిద్దునా!" అన్నాడు బండివాడు. "ఊఁ." అన్నాడు మామ. నాకేమిటో భయం వేసింది. కానీ అనుకున్నాను. ఏముంది అయిదు నిమిషాలలో కోటకి చేరాము. రాజుగారు సగౌరవంగా స్వాగతం చెప్పారు. నేను అటూ ఇటూ కొంతసేపు పచారు చేసి ఆట దగ్గర కూర్చున్నాను. "చిన్న మామగారూ! మాకు కొంచెం ఎత్తులు చెప్తూ ఉండాలి!" అన్నారు నవ్వుతూ.

ఆట సాగుతోంది. మధ్యాహ్నం కబురు పంపిన ప్రకారం ఎత్తులు వేశారు రాజుగారు. వాటికి ఎదురు ఎత్తులు వేసి మామ "అరగంటలో ఆట ముగిసిపోయేటట్టు ఉన్నది!" అన్నారు.

"అరగంటలో అయిపోతుందా?" అన్నారు రాజాగారు. ఆ ప్రశ్నలో ఆత్రం వినిపించింది. ఆట జోరుగా వెళుతోంది. "ఏలినవారు కాపులు చిత్తగించినట్టు లేదు. వేరే రాచకార్యాలు ఉంటే మరో ఆట వేసుకుందాం!" అన్నాడు మామ.

"ఫర్వాలేదు. కానీయండి, శ్రద్ధగా వేస్తాను!" అని ఆనందగజపతులు సర్దుకుని కూర్చున్నారు. ఆట భలే హుషారుగా నడుస్తోంది. నా అంచనా ప్రకారం చూసినా రాజుగారి ఆట కాపులో పడిందే గానీ

# ఎలిజబెత్ టేలర్‌ని మించినదీమె!



ఎక్కువసార్లు వివాహం చేసుకోవడానికి సంబంధించిన జోక్స్ అన్నిటిలో హాలీవుడ్ స్టార్ ఎలిజబెత్ టేలర్ పేరు చోటుచేసుకుంటుంది. కానీ అలాంటి జోక్స్‌ని తయారుచేసే కమెడియన్స్‌కి లిండా ఎసెక్స్(51) గురించి తెలియదు.

అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో ఏండర్‌సన్ అనే ఊళ్లో ఇటీవలే లిండా పెళ్లి చేసుకుని తన 22వ భర్తని సంపాదించింది. అతని పేరు జెస్సి ఛాండ్లర్(63). విశేషం ఏమిటంటే....అతనికి, ఆమెకి గతంలో ఏడుసార్లు వివాహాలు, విడాకులు జరిగాయి. ఎలిజబెత్ టేలర్‌లా అమ్మమ్మ అయిన లిండా ఈ పెళ్లిని ఓ స్నేహితుడి ఇంటి పెరట్లో బట్టలారేసే దణ్ణెంకింద చేసుకుంది. అయిదారుగురు మించి అతిథులు లేరు. పెళ్లయ్యాక దగ్గరలో ఉన్న మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్‌కి వెళ్లారు-కాఫీ తాగడానికి.

లిండా మొదటి వివాహం 16వ ఏట జరిగింది. ఆ తర్వాత 15 మందితో 22సార్లు వివాహాలు జరిగాయి. ఒకర్ని మూడుసార్లు, అయిదుగురిని రెండుసార్లు చేసుకుంది. 22వ భర్త నంబరు పూర్వం 16. ఆ పెళ్లి 11 నెలల తర్వాత విడాకుల కోర్టుకి వెళ్లింది. 12 ఏళ్ల తర్వాత తిరిగి ఇప్పుడు వారిరువురూ వివాహం చేసుకున్నారు. లిండాకి ముగ్గురు భర్తలద్వారా ఏడుగురు పిల్లలున్నారు. వాళ్ల వయసులు 17నుంచి 33లోపు.

"ఇదే మా ఇద్దరికీ ఆఖరి పెళ్లి అని మా ఆశ!" అని అంటున్నా రిద్దరూనూ.

-ఎం. లిపి

ఎదిరింపులో ఉన్నట్టు కనిపించలేదు. ఎంతసేపూ గుర్రాల మీద దృష్టి పెట్టుకుని కాచుకుంటూ వెళ్తున్నారు రాజుగారు. మామ బంట్లను తోసుకుంటూ వెళ్తున్నాడు. రాజుగారికి ముఖం ఎరుపెక్కింది. చటీమని ఆలోచించకుండా మామ బలగంలో ఎదురు వచ్చిన గుర్రాన్ని కొట్టేసి నవ్వుతూ, "శాస్త్రులుగారు పరాకుగా ఆడుతున్నట్టున్నారు. ప్రాణప్రదంగా చూసుకునే గుర్రం పోయింది!" అన్నారు. మామకి ఒళ్లు మండినట్లయింది. "చిత్తం చిత్తం! ప్రభువులు గుర్రాలమీద మోజుపడి బాపన గుర్రాన్ని గుడ్డి గుర్రం అని ఆక్షేపించారు!" అని అంటూ పక్కనున్న గుర్రంతో శకటుని కొట్టి 'రాజు' అన్నారు. రాజుగారిని పక్కకి తప్పుకుంటే మంత్రి పోతుంది.

రాజుగారు అయిదు నిమిషాలు ఆలోచిస్తూ మంత్రిని ఇచ్చేశారు. ఒక్క గుర్రపు ఎత్తుతో శకటూ, మంత్రీ వచ్చాయి మామకి. అంతటితో ఊరుకోక "బాపన గుడ్డిగుర్రం మంత్రుల్ని పుచ్చుకున్నది, మహాప్రభూ!" అని అన్నాడు మామ. దానితో రాజుగారికి పోడిగించినట్లయింది. ఒక్క నిముషం వినవినలాడినట్లు ముఖం పెట్టి "శాస్త్రులుగారి ప్రజ్ఞ చూస్తాం, ఇవాళ తోసిరాజుగా కట్టేస్తాం!" అని చాలా హుషారు కూర్చుని "చిన్న మామగారు చూస్తూ కూర్చున్నారు. ఎత్తులో కొంచెం సాయం చెయ్యరూ!" అని నా బుగ్గ మెల్లగా నులిమారు.

చదరంగం ఆటలో ఆనందగజపతి మహారాజు చాలా ఘటికుడని ఇదివరకే చెప్పాను నీకు. తమాషాకి అన్నాడే గానీ నేను ఎత్తులు చెప్పక్కర్లేదు. అది ఆయనకో ఊతపదం. "ఏలినవారికి ఎత్తులు చెప్పరా!" అన్నాడు మామ నవ్వుతూ. నేను నవ్వుతూ ఊరుకున్నాను.

ఆట యథాప్రకారంగా సాగుతోంది. ఇద్దరూ మాటా మంతీ లేకుండా ఎత్తులు వేస్తున్నారు. ఇద్దరికీ ఒకటే ప్రతిజ్ఞ. వేసిన ఎత్తు మళ్లీ వేసుకోవడంలేదు. తోసిరాజుగా ఆట కడతానని రాజుగారు అన్న మాట మామకి శూలంతో పొడిచినట్టు అనిపించింది. కానీ కిమ్మనకుండా తదేక దీక్షగా ఎత్తులు వేస్తున్నాడు. రాజుగారు కూడా అలాగే అంత పట్టుగానే వేస్తున్నారు. మూడు గంటలు కొట్టారు కోట గంట. ఆట సాగుతూనే ఉంది. "ఫలహారం వేళ అయినట్లుంది!" అన్నారు రాజుగారు. "ఇంక అయిదు నిమిషాలలో ఆట కట్టు!" అన్నాడు మామ. రాజుగారికి ముఖం జేవురించింది. "సరే, కానీయండి చూద్దాం!" అన్నారు రాజావారు.

ఎక్కడి బంట్లు అక్కడే ఉన్నాయి. ఆట్టే జంతువులు ఎవరివీ చావలేదు. మంత్రి ఉన్నా మామకి దాని అవసరమే లేకపోయింది. ఉన్న ఒక్క గుర్రానికీ శకటుని కాపు ఉంచుకుని వెళ్లి వెళ్లి చటీమని తోసిరాజు అన్నాడు మామ. నాకు ఒళ్లంతా తేళ్లు కుట్టినట్లనిపించింది. చెమటలు పోశాయి. అలాగే పక్క చూపుతో రాజుగారి ముఖం చూశాను. కళ్లల్లోంచి చింతనిప్పులు రాలుతున్నట్టు అనిపించింది. మహల్ అంతా నిశ్శబ్దం. రాజుగారి చేయి రాజు మీద అలాగే ఉంది. ఎటూ తప్పుకునేందుకు వీలు లేదు. తానన్నమాట తనకే తిప్పికొట్టాడే శాస్త్రులు అన్నట్టు లిప్తలో సముదాయించుకుని, "నా మాట నాకే అప్పచెప్పారే! శాస్త్రులుగారు పరిణత బుద్ధులు. ఆట చాలిద్దామా!" అని బలగం రెండువేపులా వారే కలిపేశారు. నిద్రలోంచి మేలుకున్నట్టున్నది మామ మొగం. ఏదో చెప్పరాని తప్పు చేసినట్టు నాలుక కొన కరుచుకున్నాడు. కుండువాతో ముఖం తుడుచుకుంటూ "ఇవాళ మా చేత మూడు చెరువుల నీళ్లు తాగించారు ఏలినవారు!" అని లేని నవ్వుతో అన్నాడు.

"ఏమైతే నేం, మా మాట మాకప్పగించారు!" అని రాజుగారు వింతగా నవ్వి, "శాస్త్రులుగారూ! విశ్రాంతి తీసుకోండి!" అంటూ లేచాడు.

గుర్రపు బండి వచ్చింది. ఇద్దరమూ ఇంటికి వచ్చాము. దారిలో ఏదో పరధ్యానంతో కూర్చున్నాడు మామ బండిలో ఉన్నంతసేపూనూ. గదిలోకి వెళ్తూ "విశ్రాంతి తీసుకోమన్నారు రాజావారు!" అని మాత్రం అన్నారు.

సాయంత్రం అయిదు గంటలకి గుమాస్తా వచ్చాడు కోటలోంచి. ఒక ఫర్మానా ఇచ్చాడు మహారాజావారు ఇచ్చారని.

"వయసు అయిపోయింది శాస్త్రులుగారికి. ఇంకా మిమ్మల్ని రోజూ కోటకి రప్పిస్తూ కష్టపెట్టడం యుక్తంగా ఉండదు. నెలకు యాభై రూపాయలు మొదటి తేదీకి మీకు గుమాస్తా 'పెన్షన్' తెచ్చి చెల్లిస్తూ ఉంటాడు. స్వీకరిస్తూ ఉండగోరుతున్నాము'. "తోసిరాజు ఎంతపని చేసిందో చూడు!" అన్నాడు మామ.

■

(శాస్త్రులుగారి కుమారులలో కడసారి కొడుకు శ్రీ కూరెళ్ల హరిహరస్వామి, ఆయనకు పెద్దవాడు శ్రీ రాధాకృష్ణమూర్తి వీరిద్దరూ చదరంగంలో ఘటికులు. కానీ హరిహరస్వామిగారు అందె వేసిన చేయి. వేసిన ఎత్తు తీయడం అంటే సహించలేని ఆటగాడు. వీరి మాతృదేవి మహాలక్ష్మమ్మగారు కూడా అద్భుతంగా చదరంగం ఆడుతారు. భర్త వల్ల విని ఆమె నేర్చుకున్నదీ విద్య. ఈ కొడుకులు పిత్రార్జితమైన ఆస్తిగా చదరంగం ఆట కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటికీ విజయనగరం ప్రాంతంలో చదరంగం ఆట జీవించి ఉందంటే కూరెళ్ల ప్రతిభా ప్రభావం వల్లనే అంటే ప్రత్యాఖ్యానం ఉండదు.)